## అంతా మిధ్య! - by అరుణ బీరకాయల



అప్పుడే అంత్యాక్షరి పోటీ అయింది టింపనీ స్కూల్ ఫంక్షన్ లో. 1993 లో 10th పాస్ అయిన బాచ్ వాళ్ళు అందరూ కలిసారు చాలా ఏళ్ళ తరువాత అదే స్కూల్ లో. ఇంచు మించు ప్రతీ ఏడాదీ జరుపుకుంటూ ఉంటారు కానీ ఏ ఏడాది ప్రత్యేకత ఏమిటీ అంటే అందరివీ ఇంజినీరింగ్ అయిపోయి, పై చదువులకో, ఉద్యోగాలకో వెళ్ళిపోబోతున్నారు. కొంత మంది పై దేశాలు కూడా వెళ్ళొచ్చు. అంచేత ఇంతకు ముందు సమావేశాలకు రాని వాళ్ళకి కూడా కబురు పెట్టి, దగ్గరుండి తీసుకువచ్చారు. అందులో ఒకడు శైలేష్. ఇప్పుడు ఎలెక్ట్రానిక్స్ లో ఇంజినీరింగ్ చేసి M.Tech IIT Madras లో చేయబోతున్నాడు. చూడటానికి సిదానం గా ఉన్నాడు.

వంటల పోటీలు అయిపోగానే డిన్నర్ చేసేసి ఇంక మిగతా ముచ్చట్లు, ఆటలూ సాగించాలని అనుకున్నారు. ఉన్న పదహారు అమ్మాయిల్లో ఒక తొమ్మిది మంది ఏవో వంటలు చేసి తీసుకు వచ్చారు. ఒకప్పుడు వీళ్ళ టీచర్లని ఇప్పుడు జడ్జీ లు గా పెట్టి పోటీ మొదలు పెట్టారు. దేనికి ఫస్టు, సెకండ్ ఎవరికి ఇవ్వాలో తెల్చడం చాలా కష్టం అయింది. మొత్తానికి రెండు వంటకాలు సెలెక్ట్ చేసారు. అందులో రెండో స్థానం రాధ చేసిన పకోడి కి వచ్చింది.

ఇంక అందరూ భోజనాలు మొదలు పెట్టి గుంపులు గుంపులు గా చేరి మాట్లాడుకుంటున్నారు. రాధ చేసిన పకోడీ దగ్గరకు శైలేష్ వచ్చాడు. అదే సమయానికి రాధ కూడా పక్కన ఉన్న కూర వడ్డించుకుంటోంది.

వడ్డించుకోవడం అయిపోయి అటు వెళ్తుంటే శైలేష్ ని ఎదురుగా చూసి గబుక్కున పలకరించింది. "హలో శైలేష్ ఎలా ఉన్నావు? గుర్తు పట్టావా? నేను.. రాధ."

"హల్లో రాధా.. నేను బాగున్నాను. మీరెలా ఉన్నారు? " అని మొహమాటపడుతూ అడిగాడు.

ఆ పిలుపుకు కళ్ళు పెద్దవి చేసి, "మీరా? నువ్వు నన్ను మీరు అని అంటున్నావా!? ఏమిటి శైలేష్ ఎలా ఉండేవాడివి ఇలా అయిపోయావు!? అవునూ ఇన్నాళ్ళూ గెట్ టుగెదర్స్ కి రాలేదేమి? పై ఊర్లో చదువుకుంటున్నావా? ఇవాళ కూడా లేట్ గా వచ్చినట్లున్నావు? నేను పలకరింపుల సెక్షన్ లో నిన్ను చూసినట్లు లేదు?!" అని అడిగింది రాధ.

"ఆ అవును, నేను మద్రాసు లో చదువుకునే వాడిని. నాన్నగారికి కూడా బేంక్ మేనేజర్ గా అక్కడకి ట్రాన్స్ ఫర్ అయింది. అందుకే ఇటు రావడం తగ్గింది. ఇదిగో ఈసారి చాలా స్పెషల్ అని సందీప్ మరీ మరీ చెప్పాడు. సరే, ఎలాగూ శలవలు అని అందరినీ చాలా రోజులు అయింది కలిసి అని వచ్చాను. అవునూ నువ్వు ఈ పకోడీ చేసావా!? నువ్వు!?" అని ఆశ్చర్యపోతూ అడిగాడు రాధ ని.

"ఆ అవును ఏమి!?" అని ఆశ్చర్యం గా అడిగి, మళ్ళీ "ఓహో అదా నీ డవుట్" అని చెప్పి నవ్వింది. "అవునూ నువ్వేం చేస్తున్నావు? ఇప్పుడు ఏమి చెయ్యబోతున్నావు శైలేష్?" అడిగింది..

"నాది B.Tech ఎలెక్ట్రానిక్స్ అయింది. M.Tech చెయ్యబోతున్నా మద్రాస్ IIT లో" అని చెప్పాడు. నవ్వుతూ రాధ మొహం లో వచ్చే ఆశ్చర్యాన్ని ముందరే ఊహిస్తూ...

"హ హ నువ్వు ఎలెక్ట్రానిక్స్!? బాగుంది బాగుంది! ఏంటో ఎన్ని మార్పులు వస్తాయో కదా!? సరే లే కానీ, డిన్నర్ అయ్యాక మెల్లగా మట్లాడదాం" అని వెళ్ళి తనకి చాలా ఇష్టమయిన టీచర్ పక్కకు వెళ్ళి కూర్చుంది. టీచర్ ఇంకెవరితోనో మాట్లాడుతుంటే ఒకసారి రింగులు తిరిగాయి రాధ కి.

* * *

ఎనిమిదవ తరగతి లో బెంచ్ కి ఇద్దరు చొప్పున వీళ్ళిద్దరూ పక్క పక్కన కూర్చొనే వారు. శైలేష్ చాలా అల్లరి పిల్లాడు. రికార్డ్ లలో డ్రాయింగులూ గట్రా రాధ చేత వేయిపించేవాడు బెదిరించి మరీ! చెయ్యను అని చెప్తే, టీచర్ కి సమాధానం చెప్పేటప్పుడు సడన్ గా కంపాస్ పెట్టి గుచ్చుతా జాగ్రత్త అని అనేవాడు. ఒక సారి అన్నంత పనీ చేసాడు. రాధ వాళ్ళ నాన్న వచ్చి మందలించి వెళ్ళినా కూడా, ఆ అబ్బాయినే పక్కన కూర్చోపెట్టారు వాళ్ళ క్లాస్ టీచర్. ఆమె బాధ ఆమెది! వీళ్ళొక్కళ్ళకే కాదు, క్లాసు మొత్తం అందరికీ అలాంటి కాంబినేషన్ లతోనే కూర్చోపెట్టింది. ఒక నెమ్మదస్తుడు/రాలు లేదా, రివర్సు! ఏమన్నా అంటే ఏ వయసు నుండే మనకు ఇష్టం లేని, కష్టమయిన పరిస్థితులను

భరిస్తూ చాకచక్యం గా ఎదుర్కోవాలనే ఉద్దేశ్యం ఆమెకు! అదేమో కానీ ఈ అల్లరి పిల్లాడు మాత్రం ఒక రకంగా విసిగించేవాడు వాడి పక్కన ఎవరిని కూర్చోపెట్టినా!

ఎనిమిదవ తరగతిలో కొత్తగా అబ్బాయిలకు ఎలెక్ట్రానిక్స్ మరియూ అమ్మాయిలకు వంటల క్లాసులూ మొదలు పెట్టారు. రేపొద్దున్న ఇంటి పనులకి సహాయ పడతాయి అని. కానీ రాధ కి విపరీతమయిన దుమ్ము ఎలర్జీ. పక్కింట్లో పిండి జల్లిస్తే ఈ ఇంట్లో కనీసం వంద తుమ్ములు తుమ్మి రాద్ధాంతం చేసే రకం! ఇక సెనగ పిండి అంటే, వెయ్యి మైళ్ళు దూరం అమ్మగారు! అది ఇంకో రకమయిన ఎలర్జీ! వొళ్ళంతా దద్దుర్లు, తుమ్ములు గట్రా. ఇలా కాదు అని ఎలెక్ట్రానిక్స్ తీసుకుంది.

ఇహ శైలేషుడి విషయానికి వస్తే...కనీసం నాలుగు కోణాలున్నా బొమ్మ గీయడానికి బద్ధకించి పక్కవాళ్ళ చేత గీయించే రకం! వాడి సంగతి తెలిసి, వంటలు తీసుకుంటా అంటే కిక్కురు మనకుండా ఒప్పుకున్నారు క్లాసు టీచర్.

ఎలెక్ట్రానిక్స్ మొదటి క్లాసులో మగ టీచర్ వచ్చి, "గుడ్ మోర్నింగ్ బోయ్స్" అని చెప్పి పాఠం మొదలు పెట్టారు. క్లాసు లో కొంత మంది తింగరోళ్ళు kikiki మంటూ నవ్వుతూ గుస గుస లాడుకుంటున్నారు రాధ వెనకాతల. అప్పుడు గమనించారు మాష్టారు. "ఏమ్మా నీది ఈ క్లాసేనా?" అని అడిగారు.

అవును అని చెప్పి ఎటండెన్సు వేయించుకుంది రాధ. ఈసారి క్లాసుకి వచ్చినప్పుడల్లా "గుడ్ మోర్నింగ్ బోయ్స్ ఏండ్ వన్ గర్ల్" అని చెప్పి కూర్చోమనేవారు. మళ్ళీ ఇకయికలూ గుసగుసలూ తప్పలేదు. ఇంక లైటు తీస్కొని, తన పని ఏదో తను చూసుకొనేది రాధ.

మొదటి రెండు వంట క్లాసుల్లో మనవాడికి పొయ్యిలూ, పెనాలు, ఓవెన్లు గట్రా ఎలా వాడాలో నేర్పించారు. పెద్ద ఇబ్బంది ఉండలేదు. కానీ మూడో క్లాసు నుండి మొదలయ్యాయి కష్టాలు రాధకి. శైలేషు వండితే రాధ కేలా బాధ అనుకుంటున్నారా? అబ్బే మరేం లేదు.. వాడు వొండినవన్నీ తెచ్చి రాధని "తింటవా సత్తావా" అని బెదిరించేవాడు. అసలే అంతంత మాత్రం.. ఇక వాడు చేసిన ఆ ఉడికీ ఉడకని కేకు ముక్కలు, బ్రెడ్డు ముక్కలూ తినాలంటే చాలా కష్టపడేడి. వద్దు అంటే చాలు.. తన పెన్సిల్ బోక్స్ తీసి, ఫాను ఆపి, ఫాన్ మీద అది పెట్టి మళ్ళీ స్విచ్ వేసేవాడు. అవన్నీ చెల్లాచెదురయిపోయేవి! టీచర్ కి ఎంత చెప్పినా ఏమీ లాభం లేదు! అవన్నీ యేరుకొని వచేసరికి హోం వర్కు బుక్ కాస్తా కిటికీలోంచి విసిరేసేవాడు. ఇలా ఎన్ని వస్తువులని దగ్గర పెట్టుకుంటుంది పాపం రాధ మాత్రం? అప్పటికీ తన ఎలెక్ట్రానిక్స్ క్లాసు అయిన వెంటనే గబ గబా తన వస్తువులన్నీ తన పట్టులో పెట్టుకొని యుద్ధానికి సిద్ధం అన్నట్లు సిటారుగా కూర్చుంటుంది శైలేష్ కింద వంట క్లాసు నుండి వచ్చే సమయం కి! అయినా వాడి చేతిలోకి ఏదో ఒకటి దొరుకుతుంది! ఇలాగే ఒక రోజు వాడు చేసిన పకోడీ ససేమీరా తినను అని రాధ మొండికేస్తే పక్క వాడి దగ్గరనుండి కత్తెర లాక్కొని రాధ రెండు పిలకల్లో ఒక పిలక సగానికి టపుక్కున కత్తిరించి పడేసాడు. అప్పటి వరుకూ వాడి చేష్టలకి ఏనాడూ ఏడవని రాధ ఆ రోజున భోరు భోరు మంటూ ఏడుచుకుంటూ వెళ్ళి మర్నాడుకు బాబ్ కట్ చేయించుకు వచ్చింది. అయినా సరే "పకోడీ తింటావా తినవా?" ..

* * *

"ఈ పకోడి తింటావా తినవా?" అని ఎదురుగుండా సందీప్ గిన్నెలో ఉన్న ఆఖరి పకోడీ ముక్కలు కావాలా వద్దా అని రాధ ని అడుగుతున్నాడు.

"వద్దు అని చెప్పరాదు!?" అని అంటూనే మిగిలినవి తన పళ్ళెం లోకి వేసుకున్నాడు.

అలాంటి ఆ అల్లరి శైలేష్ ఇప్పుడు ఎలెక్ట్రానిక్స్ ఇంజినీరు ఏమిటి! అలాంటి ఆ రాధ ఇప్పుడు వంటల్లో.. అదీ పకోడీ వండి గెలవటం ఏవిటి! అంతా మిధ్య!!

* * * End * * *

మీ సూచనలూ, సలహాలూ రచయిత్రి అరుణ బీరకాయల కి తెలియజేయండి.